

కథ

శ్రీదేవీ మురళీధర్

# పునరాగమనం

వాతావరణం ఆహ్లాదకరంగా ఉంది.. కిటికీ లోంచి కనబడే మేర పచ్చిక.. మబ్బు పట్టిన ఆకాశం. మంచం మీద పడుకుని బయటికి చూస్తోంది దుర్గాంబ. టీవీలో ఏదో సినిమా వస్తోన్నా ఆసక్తి కలగటం లేదు. ఆవిడ మనసు ఎన్నో మైళ్ల దూరంలో ఉన్న మనుసుల చుట్టూ పరిభ్రమిస్తోంది.. జీవితంలో మొట్టమొదటిసారిగా ఆవిడ వెనుదిరిగి తనను తాను చూసుకుంటోంది.

* * *

మంజు పిల్లలకు టిఫిన్ డబ్బాలు సర్దుతూ వంట ప్రయత్నం చేస్తోంది. తెల్లవారక ముందు నుండే ఆమె దినచర్య ప్రారంభం. ఏడులోపు పిల్లలు ఇంటి నుంచి బయటపడతారు. వారి స్నానపానాలూ మొదలైన వాటితో ఇంటిపనీ, వంటపనీ కలిపి అష్టావధానం చేసినట్లుంటుందామెకు. తాను పావుగంట ఆలస్యంగా వెళ్లినా మేనేజర్ బెత్తంలేని హెడ్‌మాస్టర్‌లాగా నిలబడి ఉంటాడు సంజాయిషీ కోసం. ఏనిమేషన్ కార్టూనులా గిరగిరా తిరుగుతోంది పని హడావుడిలో.

"ఇంకా ఎంతసేపు గ్లాసు కాఫీ కలిపివ్వటానికి" గట్టిగా విసుక్కుంటూ వినిపించింది అత్తగారి గొంతు.

"తెస్తోంది నానమ్మా, మాకు డబ్బాలు సర్దుతోంది" పిల్లలు అంటున్నారు.

"ఎంత విసుగ్గా ఉంటుంది గుక్కెడు కాఫీ కోసం పడిగాపులు కాయటం" ఇంకాస్త తీవ్రంగా వినిపించి కాఫీ గ్లాసు తీసుకొస్తున్న మంజు ఏమనుకుందో ఆవిడకు అందించకుండా వెనుదిరిగి వంటింట్లోకి వెళ్లిపోయింది.

ఇంకా లేవని కొడుకు మంచం దగ్గరికి నడిచిందావిడ. "నువ్వు తాగేటప్పుడు నాక్కూడా గుక్కెడు కాఫీ ఇప్పించరా అబ్బాయ్!"

స్నానానికి అటుగా వచ్చిన మంజుకి అది వినిపించింది. 'ఇక్కడ గదిలో కొడుకు దగ్గరికి వచ్చే బదులు వంటింట్లోకి వచ్చి తీసుకోవచ్చు కదా. అన్నీ ఒళ్లు మందే పనులు' అనుకుంది.

తల్లి మాటలకి నిద్ర చెదిరి కళ్లు తెరిచిన మంజునాథ్ "అదేమిటమ్మా" అన్నాడు అర్థంకాక.

"ఏమిటంటే ఏం చెప్పను? ఇంతదాకా కాఫీనీళ్లకు గతి లేదు నీ కొంపలో" కొడుకు చెవిలో ఆ ముక్కవేసి వంటింటివైపు నడిచిందామె.

* * *

సీత జారిపడి కాలు బెణికింది. నొప్పికి ఆ రోజల్లా లేవలేదు. చిన్నకొడుక్కి నూట మూడు జ్వరం. ఆఫీసుకు వెళ్లలేదు. పిల్లవాణ్ని డాక్టరు దగ్గరకి తీసుకువెళ్లటం కూడా కుదరక ఫోను మీదే మందు కనుక్కుని వేసి, నుదుట తడిబట్ట వేస్తూ పడుకుంది. సీతాపతి క్యాంప్‌కి వెళ్లాడు.

పడకగది తలుపు దగ్గర వచ్చి నిలబడిన అత్తగారి వైపు ప్రశ్నార్థకంగా చూసింది. 'ఎలా ఉంది' అని తననీ, పిల్లాడినీ పలకరించడానికి వచ్చినట్లుంది అనుకుంటూ.

"ఇవాళ్టికి లేవవా?" సూటిగా, మాట మిగలకుండా అడిగిందావిడ కోడల్ని.

"కాలు బెణికి నొప్పి చేసింది. సెలవు పెట్టి ఇంట్లో ఉన్నాను" ఇరిటేషన్ దిగమింగి సాదాగా జవాబు చెప్పింది.

"నాకు ఇవాళ డాక్టరు చెకప్ ఉంది, మర్చిపోయావా?"

ఆశ్చర్యంగా చూసింది సీత.

"పిల్లవాడికి జ్వరం కాలిపోతోంది. వాణ్నే డాక్టరు దగ్గరికి తీసుకు వెళ్లలేక ఫోను మీద మందు అడిగి వేశాను" అన్నది.

"వాడి ఈడుకు ఏ మందూ వెయ్యకపోయినా అదే తగ్గిపోతుంది. మేం పెద్దవాళ్లం. టైం ప్రకారం చూపించాలి. అది కూడా తెలీదా?"

"ఇవాళ సమస్య ఏదీ లేదుగా, రొటీన్‌గా నెలనెలా చేయించే చెకప్పే కదా. ఇంకో రోజు వెళ్లచ్చులెండి"

"ఇంకో రోజు వెళ్లచ్చు, పూర్తిగా మానచ్చు. కానివ్వండి అన్నీ మీ ఇష్టాలే. మీకొచ్చేవే రోగాలు"

విసవిసా వెళ్లిపోతున్న అత్తగారి వంక ఖిన్నురాలై చూస్తూండిపోయింది సీత 'ఇన్నేళ్లొచ్చినా ఈవిడకు సమయాసమయం విచక్షణ కలగట్లేదేం?' అనుకుంటూ.

* * *

పిల్లలు టీవీలో కార్టూన్లు చూస్తున్నారు.

"ఎంతసేపురా, పోయి చదువుకోండి పొండి" అదిలించింది ఆవిడ మనవణ్నీ, మనవరాల్నీ.

"ఏం? నీకు సీరియల్ టైమైందా?" అడిగారు పిల్లలు కోపంగా.

"నేను చూసేద్దేవే మూడు సీరియళ్లు. అవీ చూడనివ్వకపోతే ఎట్లా చచ్చేది?"

"రోజంతా నువ్వు ఒక్కదానివే చూస్తావుగా నానమ్మా. ఇవాళ సండే. మమ్మల్ని చూడనీ ప్లీజ్" తండ్రికి ఫిర్యాదు చేసి గొడవ పెడుతుందన్న భయానికి అర్థింపుగా అన్నారు పిల్లలు. అలా ఎన్నోసార్లు జరిగింది.

"ఇంకా నయం. మళ్లీ కథ మిస్సవుతాను. అందులో ఇవాళ ముఖ్యమైన మలుపులున్నాయి. లేవండి. లేవండి"

"పో నానమ్మా, ఎప్పుడూ నీ మాటే సాగాలంటావు"

"అవునురా, నా కొడుకు ఇల్లు మరి. భేషుగ్గా సాగించుకుంటాను నా కోసమే కేబుల్ పెట్టించాడు నా కొడుకు"

"ఆ మాట అవసరమా?" కఠినంగా వినబడి గిరుక్కున వెనుదిరిగిందావిడ. మంజు నిలబడి ఉంది.

"అవునే, అవసరమే అంటాను మరి. అనకుండా ఊరుకుంటే నా హక్కులు నాకుంటాయని పిల్లలకు కూడా అర్థం కావద్దూ?"

"బోడి టీవీ సీరియల్ కోసం హక్కులూ, చట్టాలూ తవ్వి తియ్యక్కర్లేదు" కోపంగా అంది మంజు.

"నన్ను బోడి అంటావుటే?"

"మిమ్మల్నెవడన్నాడు? టీవీ సీరియల్ని అన్నాను" విసురుగా జవాబిచ్చింది.

"అదే అదే నన్ను అనదలచిన మాట టీవీని అన్నావు ఆమాత్రం అర్థమవుతుందిలే"

"మీకు కొడుకు ఇల్లైతే వాళ్లకి నాన్న ఇల్లు. వాళ్లకీ హక్కులుంటాయి"

"ఉంటాయి ఉంటాయి. ఇంకా నేర్పించి పెట్టు. బాగుపడతారు"

"నేను కాదు మీరే తీశారు హక్కుల ప్రసక్తి. మిమ్మల్ని చూసే నేర్చుకుంటారు"

"అనవే అను. టీవీ కోసం పెద్దా చిన్నా లేకుండా తగాదాలకు రండి. పాడు సంత, పాడు పెంపకాలు! ఛీ" అంటూనే దభీమని అక్కడే మొండిగా చతికిలబడిందావిడ.

కోపం, చికాకు పట్టలేక పిల్లలిద్దరినీ చెరొకటీ తగిలించి లోపలికి లాక్కెళ్లింది మంజు.

"ఏమైంది? పిల్లలు ఏడుస్తున్నారేం?" అంటూ వచ్చాడు మంజునాథ్.

రిమోట్‌తో ఛానెల్ మారుస్తూ కొడుకుతో "ఏముందీ? నన్ను కొట్టలేక వాళ్లిద్దర్నీ కొట్టి ఈడ్చుకెళ్లింది. అయినా పిల్లలకి ఇంత టీవీ పిచ్చి పనికిరాదు" లోపలికి చురుగ్గా చూస్తూ చెప్పిందావిడ.



ఆ ఆదివారం సెలవురోజున పిల్లల్ని తీసుకుని పార్కుకి వెళ్లింది మంజు ఒంటరిగా.

అత్తగారు టీవీ దగ్గర నుంచి లేచే అవసరమే రాలేదా పూట.

★ ★ ★

కొన్ని ముఖ్యమైన పనులు ముగించాల్సిన అవసరం కలిగి సగం పూట లీవు పెట్టి ఇంటికి చేరుకున్న సీతకి కొత్త గొంతులు వినిపించాయి. 'ఎవరో వచ్చారే' అనుకుంటూ ఇంట్లోకి రాబోతోంటే తన పేరు వినిపించి బయటనే ఆగింది.

"సీతా వాళ్ల పుట్టింటి వాళ్లు ఇక్కడే ఉన్నారుటగా ఏడాది నుంచీ!" అంటున్నారు.

"ఆ, ఇక్కడే. దిక్కుమాలిన సంత. ఒక మంచీ మర్యాదా ఏదీ లేదు. నాకు పెళ్లిలో పెట్టిన కట్నాలే. తరువాత పిల్లలు పుట్టినప్పుడు ఏదో లాంఛనప్రాయంగా పెట్టారు. ఇన్నేళ్లు కావస్తోంది. పెద్దదాన్ని బతికున్నాను కదా. వియ్యపురాల్ని మొన్న ఉగాదికి భోజనానికి పిలిచి కొత్తచీర పెట్టాలనే జ్ఞానం లేకపోయింది" కరుకుగా వినబడింది అత్తగారి గొంతు.

"సీత తండ్రి పోయాడు కదండీ. ఎవరున్నారు అక్కడ పెట్టుపోతులు నెరపటానికి" సర్దిచెప్పబోతున్నారు అవతలి వాళ్లు.

"అన్న, తల్లి బతికే ఉన్నారుగా. ఉన్నవాళ్లే బాధ్యత వహించి పెట్టాలి. ఆ మాత్రం తెలీదా పిల్లనిచ్చుకున్నవాళ్లకి?" అక్కసుగా అంటోందావిడ.

"అలాంటి పట్టింపులు పెట్టుకుంటే కష్టం కదండీ! అసలే జరుగుబాటు కష్టమైన రోజులాయె. ఇంకా నయం సీత బుద్ధిమంతురాలు. కాలు కదపనివ్వకుండా చేసి పెడుతుంది" సీతను సమర్థిస్తూ అంటున్నారు వాళ్లు.

"ఏం బుద్ధిమంతురాలోలెండి. అయినా నా పనులు నేను చేసుకుంటాను. నా రూపాయి నేను ఖర్చు పెట్టుకుంటాను. ఒకరి దయా ధర్మాలు నాకక్కర్లేదు. ఏముంది ఆవిడగారు ఒరగబెడుతున్న సేవ? వేళకింత ఉడకేసి తమతోపాటు ఒక ముద్ద పడేస్తుంది మీరు చెప్పిన ఇంతోటి బు.ద్ధి.మం..తు..రా..లు" సాగదీసిందావిడ వెటకారంగా.

లోపలికి అడుగుపెట్టిన కోడల్ని చూసి బిగుసుకుపోయి కోపంగా కూర్చున్న అత్తగారిని చురచురా చూసి లోపలికి వెళ్లిపోయింది సీత. వాతావరణం ఇబ్బందిక

రంగా అనిపించి వచ్చినవాళ్లు లేచి "వెళ్లొస్తానమ్మా సీతా" అని గొణుగుతూ బయటికి నడిచారు.

చుట్టాల ముందు పరువు హీనంగా అనిపించిన సీత ముఖం కడుక్కుని కాఫీ కలుపుదామని వంటింట్లోకి నడిచింది. అప్పుడే కాఫీ కలిపిన గిన్నె గ్లాసులు కనిపించాయి. తన వరకు కలుపుకుని కప్పుతో తన గదిలోకి నడిచింది. "కనీసం పెద్దదాన్ని పడున్నాను. కాఫీ కలిపి ఇద్దామని కూడా అనుకోదు.. బుద్ధిమంతురాలని బిరుదొహటి!" పళ్లు పటపట కొరుకుతూ కోడలికి వినిపించేటట్లు అన్నదావిడ. ప్రతి క్రియగా అంతదాకా తెరిచి ఉన్న గది తలుపు మూసుకుంది.

* * *

కొన్నేళ్లు గడిచాయి.

"ఎంతైనా మంజునాథం పిల్లలు నీ పిల్లల్లా కాదురా అబ్బీ!" సీతాపతి టిఫిన్ చేస్తూంటే కూచుని ఉపోద్ఘాతంగా అన్నది తల్లి. అర్థంకానట్లు చూశాడతను.

"అబ్బో, విచ్చలవిడి, చెప్పిన మాట వినరు. ఆడింది ఆట, పాడింది పాట!"

"పాపం బాగానే చదువుకుంటున్నారు కదమ్మా"

"ఆ... ఏం బాగోలే పిల్ల ఇంటరు చదువుతుందన్న మాటే కానీ అబ్బో ఆ స్టయిలు చెప్పనలవి కాదు. వంద లకు వందలు బట్టలకు, చెప్పులకు, అందానికి మెరుగులు దిద్దటానికి అమ్మా, కూతురూ తగలేస్తారు. ఆ పిచ్చివెధవ రెక్కలు ముక్కలు చేసుకుని సంపాయించుకొస్తే వీళ్లది ఈ వరస"

"అదేవిటమ్మా, వదిన కూడా బాంక్‌లో ఉద్యోగం చేసి బాగానే సంపాదిస్తుందిగా" తల్లి ధోరణి ఆపాలని అన్నాడు సీతాపతి.

"అది చేసీ ఒకటే, నేను చెయ్యకా ఒకటే. పైసా విదల్చదు. పుట్టింట్లో పనికిరాని అన్న ఒకడున్నాడు. నెల నెలా వాడి ఎదాన కొడుతుందేమోనని నా నమ్మకం"

"ఛ..ఛ. ఏం మాటలమ్మా వదిన జాగ్రత్త పరురాలు. పిల్ల పెళ్లికి దాస్తూందేమోలే. నీకన్నీ పిచ్చి అనుమానాలు" తీసిపారేస్తూ అన్నాడు.

"సర్లే చెప్పొచ్చావు. మంజునాథానికి నోట్లో నాలుక లేదు. అందుకే నెత్తికెక్కి ఆడుతున్నారు పెళ్లాం, పిల్లలు. ఫోన్లలో గంటలు గంటలు ఎవరితోనో కబుర్లు, ఆడో మగో తెలీదు"

"ఎవరూ వదినే?" ఆశ్చర్యంగా నమ్మలేనట్లుగా అడిగాడు సీతాపతి.

"ఆహా సాక్షాత్తూ మీ వదినే. బాంకు స్నేహితులుట నాయనా. కాఫీలకూ, భోజనాలకూ వస్తారు. ఒకటే కబుర్లు, పకపకలు, చిర్రెత్తుకొస్తుంది"

"ఒకే చోట పనిచేసేవారు కబుర్లు చెప్పుకోరుటమ్మా నీ వెర్రిగానీ" తల్లిని శాంతపరుస్తూ అన్నాడు.

"ఆరినీ, సత్యకాలం తగలెయ్య. పెళ్లయిన ఆడదానికి పరాయి వెధవలతో కబుర్లేవిటిరా. నాకింకా కళ్లు పోలేదు. వాళ్ల పిల్లకు కూడా మగస్నేహితులున్నారు" ధారావాహిక సీరియల్ కొనసాగుతూంటే పిల్లలను అక్కడి నుంచి లేపి పడకగదిలోకి వెళ్లిపోయింది సీత.



ఆ రాత్రి భర్తతో అన్నది "మన ఇంటి గురించి కూడా ఇలాంటి చెడ్డమాటలే మీ అన్న ఇంటికి చేరతాయి. ఆవిడ చెప్పేవన్నీ గుడ్డిగా నమ్మి బుర్రకెక్కించుకోకండి"

"సరేలే మా అమ్మ అలాంటి మనిషి కాదు. మన పిల్లల్ని మంచివాళ్లని మెచ్చుకుంటోంది. విన్లేదా?" వినుగ్గా అటు తిరిగి పడుకున్నాడు సీతాపతి.

"ఆ.. ఆ.. విన్నాను. పెద్దపులి మెచ్చుకోలు. అందుకే జాగ్రత్త చెబుతున్నాను. అన్నీ కొంపలు మునిగే మాటలు. రేప్పొద్దున్న పెళ్లిళ్లు కూడా కావు ఇలాంటి ప్రచారాలు జరిగితే! మనకీ ఆడపిల్ల ఉన్నది. మర్చిపోకండి!" బెడ్ లైట్ వేస్తూ దిగులుగా అన్నది.

* * *

"పులుసు చాలా బావుందమ్మా. నీలాగా ఎవ్వరూ పెట్టలేరు ఇంత రుచిగా" తల్లితో అన్నాడు మంజునాథం భోంచేస్తూ.

దుర్గాంబ ముఖం తృప్తితో విప్పారింది. "అవునురా. సీతాపతి కూడా ఆ మాటే అంటాడు అమ్మా రుచులు మరిచిపోయి చాలా కాలమైంది అని" టేబిల్‌కి దగ్గరగా కుర్చీ లాక్కుని కూర్చుందావిడ.

'ఇహ అసలు వడ్డన మొదలు' అనుకుంది కోపంగా మంజు.

"ఎన్నిసార్లు చెప్పినా నీ మరదలికి మన పద్ధతి వంట చాతకాలేదురా" ఉపోద్ఘాతంగా అన్నది.

'ఆత్మస్తుతీ, పరనిందా ప్రారంభం' నిట్టూర్చింది మంజు.

"అదేమిటమ్మోవ్? వంట చాలా బాగా చేస్తుందే సీత?" అన్నాడు మంజునాథం.

"ఆ, నా మొహం బాగు. ఒకటుంటే ఒకటుండదు. వాడి పాట్లూ, నా పాట్లూ భగవంతుడికే తెలియాలి"

"అబ్బెబ్బె. అట్టా మాట్లాడకు. నిజానికి మంజు వంట కన్నా సీత వంటే ఒక పిసరు ఎక్కువ నచ్చుతుంది నాకు" మరదల్ని వెనకేసుకొస్తూ అన్నాడు.

"ఒక శుచీ సుబ్బరం లేవు. ఏదో నాలుగు గిన్నెలలో ఉడకేసి టేబిల్ మీద తగలేస్తుంది. చచ్చినట్లు మళ్లీ నేను పోపులూ, ఉప్పులూ, కారాలు వేసుకుని రిపేరు చేసుకో

## శ్రియ తీరు

*స్వతహాగా తెలుగు అమ్మాయి కాని శ్రియ ఈమధ్య ఓ మలయాళ చిత్రంలో నటిస్తోంది. అక్కడామె సెట్లో బాయ్స్‌తో తెలుగులో మాట్లాడుతూ పనులు చెప్తోందిట. మలయాళ చిత్రం షూటింగ్‌లో తెలుగు మాట్లాడే సరదా శ్రియకేమిటో కదా? అలాగని తెలుగు సెట్లో మాత్రం వీలైనంత వరకూ ఇంగ్లీషే పలుకుతుందిట ఈ ఢిల్లీ చిలక. శ్రియ తీరుకు మలయాళ చిత్రం సెట్లో వాళ్లంతా విస్తుబోయారట. ఇదో రకం పబ్లిసిటీ టెక్నిక్ కాబోలనుకుంటున్న సినీజనాలూ వున్నారు.*

వాలి"

"అసలు ఉప్పులూ, కారాలూ తినొద్దనేగా డాక్టర్ నీకు చెప్పింది? నూనె, నెయ్యి అన్నీ మితంగానే వాడాలని చెప్పారు కదా. అందుకే అలా చేస్తుందేమో. మళ్లీ తగుదునమ్మా అని నువ్వు కలపటం దేనికీ?"

"డాక్టర్లకి సలహాలివ్వటం తప్ప పనీపాటూ ఉండదురా, లక్షణంగా తినేవాళ్లని నోరు కట్టుకొమ్మంటారు. అన్న ద్వేషం పుట్టి ఏడుస్తున్న వాళ్లని తినమని చంపుతారు"

పకపకా నవ్వాడు మంజునాథం. "మనం వెళ్లి కూచుని రోగాలు ఏకరువు పెడితేనే కదమ్మా వాళ్లు సలహాలు ఇచ్చేది"

"పోరా మరీ ఇదిగా చెబుతావు. మనం రోగాలు చెప్పుకుంటే నోరుమూసుకుని మందులిచ్చి పంపాలి గానీ ఈ పిచ్చి సలహాలటరా ఇచ్చేదీ?"

"నోరు మూసుకుని మందులిచ్చి పంపేది మెడికల్ షాపువాళ్లు నానమ్మా డాక్టర్లు కాదు" అన్నాడు మెడిసిన్ చదువుతున్న మనవడు.

"ఒరెఒరె. నువ్వొహడివున్నావని మర్చేపోయానురా" అన్నదావిడ ఏమనాలో తెలీక.

ఆ పూట ప్రసారం సమాప్తం.

అంత వయసొచ్చి సొంత కుటుంబ సభ్యుల మధ్య ఒకరి మీద ఒకరికి పితూరీలు చెబుతున్న అత్తగారి వంక చీదరగా చూసింది మంజు. వాళ్లింట్లో ఉన్నప్పుడు మా మీద కూడా ఇలాగే చెబుతుంది కాబోల్ను అనుకుంది నిర్ధారణగా.

* * *

దుర్గాంబకు ఇద్దరు కొడుకుల తరువాత ఒక కూతురు. అల్లారుముద్దు గారాలపట్టిగా పెంచింది. ఏనాడూ అత్తమామల్నీ, ఆడపడుచుల్నీ ఆదరించకపోగా అడుగు కూడా పెట్టనివ్వని తల్లి పెంపకంలో లలిత కూడా ఆవిడ ప్రతిబింబంగా పెరిగింది.

ఒక్కగానొక్క కొడుకు ఉన్నచోట ఇచ్చి చేశారు తోడి కోడళ్ల బాధ, ఆస్తి పంచుకునే వారూ ఉండకూడదని. ఆ అబ్బాయికి ఒక చెల్లెలు. ఆమెకి అప్పటికే పెళ్లయింది. తండ్రి చనిపోతే తల్లి తాలూకాఫీసు గుమస్తాగిరీ చేస్తూ ఒక్క చేత్తో పెంచి పెద్దచేసింది పిల్లల్ని.

తల్లి దర్శకత్వ పర్యవేక్షణలో లలిత జయప్రదంగా వేరు కాపరం పెట్టింది. అత్తగారికి అన్నం, మామగారికి తద్దినం పెట్టే అవసరం గానీ, ఆడపడుచుకు పసుపు కుంకం ఇచ్చే అగత్యం కానీ లేకుండా జాగ్రత్త పడింది. గత్యంతరం లేక లలిత అత్తగారు కూతురు పంచన చేరి మారు మాట్లాడకుండా రోజులు వెళ్లదీస్తోంది. ఏ బరువు బాధ్యతలూ లేని కూతురి కాపురం చూసి దుర్గాంబ ఎంతో మురిసిపోతూంటుంది.

* * *

కాలచక్రం గిర్రున తిరుగుతూంటే పెద్దరికం మాటున తప్పుల మీద తప్పులు పేరుకుపోయి ఇద్దరు అన్నదమ్ముల కుటుంబాల మధ్య పొరపొచ్చాలు, అపార్థాలు చెలరేగసాగాయి. తరచి చూడగా అన్నింటికీ మూలకారణం పెద్దావిడ అటూ ఇటూ చెప్పే మాటలూ, వేసే నిందలూ, కల్పించే అబద్ధాలు అని ఎవరికి మటుకు వాళ్లకు తేలింది.

ఇంటి మనుషుల గురించీ వారి పుట్టిళ్ల గురించీ నేరాలు, నిందలూ మోపటం ఉద్యోగస్తులయిన కోడళ్ల గురించీ, ఎదిగిన పిల్లల నడవడి గుర్చి చవకబారు విమర్శలు.. క్షమాగుణం అంతరించి, ఓపిక నశించి చిలికి చిలికి గాలివానలాగా పెద్ద పెద్ద రాద్ధాంతాలుగా మారి ఆవిడను దోషిగా నిలబెట్టాయి. ఈ మాటల వల్ల, గొడవల వల్ల భార్యాభర్తల మధ్య, తండ్రీ పిల్లల మధ్య అన్నదమ్ముల మధ్య, తోడికోడళ్ల మధ్య నున్న బాంధవ్యాలు ఆటుపోట్లకి గురైనాయి.

"నాకు మీ ముష్టి తిండి. మీ దిక్కుమాలిన కొంపలూ అకర్లేదు. రాజాలాగా ఓల్డేజీ హోంలో చేరతాను మీ రోగాలు కుదిరేట్లు. నలగురూ మీ మొహాన ఉమ్మేస్తారు" అన్నది చివరికి అక్కసుగా దుర్గాంబ.

"అంతేకానీ తప్పులు తెలుసుకుని దిద్దుకోనంటావ్!" అన్నారు కొడుకులు విస్తుపోతూ.

"చాతనైతే పెళ్లాలకు గడ్డి పెట్టండిరా చవట సన్నాసుల్లారా. మగాళ్లయితే నాకు క్షమాపణ చెప్పించండి" అన్నది కాళ్లు ముందుకు జాపి కూర్చుంటూ.

"ఏడ్చినట్లుంది అందరికీ మనస్పర్థలు పెట్టి పైగా మేము క్షమాపణ చెప్పాలిట. గోదాట్లో దూకుతాం కానీ అలాంటి వెర్రి మొర్రి పనులు చెయ్యం" అన్నారు కోడళ్లు.

చేసేది లేక చెరి సగం ఖర్చు భరించి వృద్ధాశ్రమంలో చేర్పించారు.


* * *

వృద్ధాశ్రమం పరిస్థితి ఇంకో రకం.

పట్టెడన్నం కూడా పెట్టక పట్టించుకోక వదిలేసిన కొడుకు, కోడళ్లు కలవాళ్లు...

జబ్బు చేసి అడ్డం పడేదాకా చాకిరీ చేయించుకుని అస్వస్థులు కాగానే చెత్తబుట్టలో పారేసిన చిత్తుకాయితాల లాగా అక్కడ వదలబడిన వాళ్లు...

సంతానం లేక ఇతరులను నమ్మి ఉన్నది కాస్తా వారి హస్తగతం



## మార్లిన్ మన్రోగా కరీనా

**హాలీవుడ్** హీరోయిన్ మార్లిన్ మన్రో మరణించి దాదాపు యాభై ఏళ్లు కావస్తున్నా ఇంకా ఆమె పేరు ఎక్కడో ఓ చోట ఎలాగోలా వినిపిస్తూనే ఉంటుంది. తాజాగా ఆమె జీవితకథ ఆధారంగా హిందీలో సినిమా తీద్దామని దర్శకుడు మధుర్ భండార్కర్ సన్నాహాలు చేస్తున్నాడట. ఇందులో మార్లిన్‌మన్రోగా బాలీవుడ్ భామ కరీనాకపూర్‌ని ఎంపిక చేసాడు. కానీ ఆమె నుంచి ఇంకా గ్రీన్ సిగ్నల్ రాలేదట. డేట్ల సమస్య అనీ, పారితోషికం విషయంలోనూ కుదరలేదనీ చెప్పుకుంటున్నారు. ఈ సినిమాయే గనక కరీనా చేస్తే కెరీర్‌కి ప్లస్సే అవుతుంది.

చేసి మోసపోయి చేరిన వాళ్లు... ఇలాంటి వాళ్లు కొందరైతే-

పిల్లలు అమెరికాలో, ఆఫ్రికాలో సెటిలయి బోలెడంత పంపిస్తున్నా అవసరానికి ఆదుకునే మనిషి అండ లేక సంరక్షణ కోసం చేరిన ముసలి జంటలు...

భార్యాభర్తలు ఉద్యోగ బాధ్యతల తుఫానులో కొట్టుమిట్టాడుతూ పిల్లల్ని కనే ఓపిక లేక పెద్దల్ని చూసుకునే తీరిక లేక అక్కడ వదలబడిన పెద్దల జంటలు...


చివరగా...

అందరూ ఉండి లోటు లేకుండా చూస్తోన్నా ఎవ్వరితోనూ పడక ఎంతకీ సంతృప్తి చెందక తమ మాటే సాగాలని, స్పర్ధలు సృష్టిస్తూ మూర్ఖంగా పిల్లల మనసులతో, జీవితాలతో ఆడుకునే ముసలివాళ్లు కొందరు... వీరంతా చివరి దశలో చేరిన ఆఖరి మజిలీ ఆ వృద్ధాశ్రమం. ఎవరి దృక్కోణం నుంచి వారి కథ. ఎవరినీ కదిలించినా ఒక వ్యథ. గృహచ్ఛిద్రాలు ఇంటింటికీ విభిన్నంగా ఉంటాయి. ఎవరికీ వారే సరైన వారిమనుకుంటారు. ఈ విషయాలలో న్యాయం చెప్పటం ఎవరి తరమూ కాదు.

కాల్చుకు తినే కర్కోటకులైన అత్తలూ, ఆడబడుచులూ ఉన్నారు. కయ్యానికి కాలుదువ్వి అడుగుపెట్టిన మర్నాడే వేరు కుంపటి పెట్టించే కోడళ్లూ లేకపోలేదు. అన్ని సందర్భాలలో మూలకారణం స్వార్థమే! అదే విధంగా చాలావరకు 'పోనీలే సర్దుకుపోదాం' అని జీవితంతో రాజీపడాలని చూసే మంజు, సీత వంటి సంస్కారవంతులైన ఉద్యోగపరులూ కోడళ్ల స్థానంలో ఉన్నారు. 'ఏదో ఒకటి, పిల్లల్ని బాగుండనీ, కృష్ణారామా అంటూ ఎక్కడున్నా గడిచిపోతుంది' అని పెద్ద మనసుతో సరిపెట్టుకుని తలవంచుకుపోయే లలిత అత్తగారి లాంటి సాధువృద్ధులూ ఉన్నారు.

మన కథాక్రమంలో- మంచి కోడళ్లను కడుపులో పెట్టుకోవడం ఆ ఇంటి పెద్దావిడ దుర్గాంబకు చాతకాలేదు. వయసు పైబడ్డాక తన ఉనికికి ప్రమాదం వస్తుందేమోనని ఊహించుకుని, తనపై కొడుకుల సానుభూతి, వారి జీవితాలలో తన ప్రాముఖ్యత చెదరకుండా ఉండటం కోసం అపసవ్యమైన పనులు చేస్తూ, ఉచితానుచితాలు మరచి తాను కూచున్న కొమ్మను తానే నరుక్కుంది. నోటి దురుసు, పెత్తనకారితనం, అగ్నికి ఆజ్యం తోడైనట్లు అతిశయించిన అహంభావం అందరూ ఉన్నా ఆమెని ఒంటరిదాన్ని చేశాయి. కొడుకులు తప్ప వచ్చి చూసేవాళ్లు లేరు. 'మమ్మల్ని అసహ్యించుకుని వద్దని పోయాక మేము అక్కడికి వెళ్లి చూసేదేముందిలే' అనుకున్నారు కోడళ్లూ, మనవళ్లూ.

'ఏదో పాపం పెద్దావిడ. తెలిసో తెలీకో...' అని మగవాళ్లు చెప్పబోతే 'అవున్లే... అదేమీ నడవడినీ, మీ పిల్లల నడవడినీ మా తల్లిదండ్రులు నోటికొచ్చినట్లు అందరిలోనూ విమర్శిస్తూ పోతే 'పోనీలే పాపం పెద్దవాళ్లు అని




మీరు దయతలచి ఊరుకుంటారా చెప్పండి' అన్నారు భార్యలు, భర్తలతో. వాళ్లు క్షణం పాటు ఆలోచించారు. 'బహుశ ఊరుకోమనుకుంటా' అన్నారు నిజాయితీగా.

'అదే మరి' అన్నారు ఆడవాళ్లు ఆ సంభాషణకు ఫుల్‌స్టాప్ పెడుతూ. అన్నారే గానీ భర్తలు చూడకుండా వారి వంక ప్రేమగా జాలిగా చూసారు... తామూ తల్లులే కాబట్టి!

* * *

"ఏమ్మా, చేరి రెండేళ్లయింది. ఎట్లా ఉందిక్కడ? నువ్వు అనుకున్నట్లు హాయిగా, ఇబ్బంది లేకుండా ఉన్నావా?" పళ్ల సంచీ టేబిల్ మీద పెడుతూ అడిగాడు సీతాపతి.

"ఏం హాయిలేరా. ఏదో ఉన్నానులే"

"మళ్లీ అదేంటి?" అన్నాడు మంజునాధం.

"ఏం లేదురా, ఎందుకో పిల్లల మీద కోడళ్ల మీద గాలి మళ్లింది. చూడాలనిపిస్తోంది"

"గట్టి చిక్కే తెచ్చిపెట్టావే! ఎలా మరి? ఏం చేద్దామంటావ్?"

"ఒక్కసారి తీసుకెళ్లి చూపించండిరా. మళ్లీ వెంటనే తెచ్చి దిగబెడుదురు గాన్లే. దీపావళి పండక్కి..వస్తాను"

బుర్ర గోక్కున్నాడు మంజునాధం.

"ఏమోనమ్మా తెగేదాకా లాగావు. గట్టిగా మాట ఇవ్వలేం. చూద్దాంలే" అన్నాడు.

ఇంకో సందర్భంలోనైతే 'పెళ్లాం చాటు వెధవల్లారా ఇళ్లల్లో ఆమాత్రం చెప్పలేరు(టా' అని విరుచుకుపడే తల్లి మౌనం వహించటం వారిద్దరికీ ఆశ్చర్యాన్ని కలిగించింది.

* * *

దీపావళి రానే వచ్చింది. ప్రమిదలతో దేదీప్యమానమైన సాయం సంధ్య పెళ్లికూతురిలా వెలుగులు విరజిమ్ముతోంది.

వృద్ధాశ్రమం అందంగా దీపాలతో అలంకరించారు.

కొందరిని పిల్లలు ఇళ్లకు తీసుకువెళ్లారు. కొందరిని పిల్లలు చూడవచ్చారు. మిఠాయిలు పంచుతోంటే వద్దన్నది దుర్గాంబ. క్రితం రోజు కొడుకులిద్దరూ పట్టుచీర తెచ్చిచ్చారు. ఎందుకో కట్టుకో బుద్ధి కాలేదు.

మూడేళ్ల క్రితం దీపావళి నాటి సంఘటన గుర్తొచ్చింది 'కొత్తచీర కట్టుకోండత్తయ్యా'

"ఎవడిక్కావాలి అలికీరకం చీర. తమరేమో సిల్క్ చీరలు సింగారించుకుంటారు నా మొహాన నేతచీర"

"సిల్క్ చీర నేను కొనుక్కున్నది కాదు మీకూ తెలుసు. మా మేనమామ షష్టిపూర్తికి పెట్టిన చీర"

"ఏమో ఎవరికి తెలుసు? సొమ్మొక్కడిది, సోకొకడిది. వాడు తెచ్చి పోసేదంతా నీ షోకులకీ చాలదాయె" మూతి విరిచింది. విసవిసా లోపలకి వెళ్లి పాతచీర కట్టుకొచ్చిన సీతకు అత్తగారి కళ్లల్లో పైశాచిక తృప్తి కనబడకుండా పోలేదు.

దుర్గాంబ మనసు కెలికినట్లయి కళ్లల్లో నీళ్లు చిప్పిల్లాయి. 'చిన్న పిల్ల.. కూతురులాంటిది. అది కళకళలాడుతూ కట్టుకుంటే నాకు కంటగింపు కలిగిందా? ఇప్పుడేం ఒరిగింది? కొడుకులు బోలెడంత పెట్టి బ్రహ్మాండమైన పట్టుచీర కొని తెచ్చారు. ఎందుకది నాకు? పిల్లలే దగ్గర లేనప్పుడు. హాయిగా కృష్ణారామా అనుకుంటూ వాళ్ల నీడలో నిక్షేపంగా రోజులు వెళ్లదీయక.. ఇంక నన్ను తీసుకువెళ్లడం జరగదు. నా మొహం చూడరు పిల్లలెవ్వరూ...'

"అదేమిటమ్మా పండగపూట కొత్తచీర కట్టుకోలేదేం? నచ్చలేదా కొంపదీసి" కొడుకు గొంతు వినిపించి ప్రస్తుతంలోకి వచ్చింది దుర్గాంబ.

"అబ్బే, అదేం లేదురా, కట్టుకోవాలనిపించలేదు"

"భలేదానివే. లే. వెళ్లి కట్టుకురా చూస్తాం" అన్నాడు మంజునాధం. ఇంతలో ఆయమ్మ పెట్టె తెచ్చి వాకిట్లో పెట్టింది.

ముసలావిడ ముఖం ముడతలలో దీపాలకాంతి, ఎనలేని సంతోషం అందరికీ వెళ్తున్నానన్నట్లు చెయ్యి ఊపి కొడుకులతో గేటు దగ్గరకి నడిచింది గర్వంగా.

పెద్ద టాటాసుమో నిలచి ఉంది బయట. కోడళ్లూ, మనవళ్లూ అంతా ఆమెను ఇంటికి తీసుకు వెళ్లటానికి వచ్చారు. అందరి ముఖాల నిండా ఆహ్వానం, చిరునవ్వు. ఆ సమాగమం కలిగించిన సంతోషం.

మనవళ్లు జాగ్రత్తగా చేయూతనిచ్చి కారెక్కిస్తోంటే 'నా ఇంటికి నేను వెళ్తున్నాను. నా పిల్ల నీడలోకి... భగవంతుడా, నీకు శతకోటి ప్రణామాలు తండ్రీ' అనుకుంది ఆనందబాష్పాలు తుడుచుకునే ప్రయత్నం చేయకుండా.

ఆఖరి మజిలీ వైపు పయనిస్తోన్న ఆ వయోవృద్ధురాలి మనసంతా ఆనందాల మతాబాలు... దారికి ఇరుపక్కలా దీపావళి సంబరాలు.

కారు పట్టుదారం మీద ముత్యంలా ఆ నిండు కుటుంబాన్ని ఇల్లు చేర్చటానికి పరుగులు తీస్తోంది. కుటుంబ పెద్ద పునరాగమనం కోసం ఇల్లు ఎదురుచూస్తోంది.